




పెద్దన్న మృతదేహం వద్ద నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, తదితరులు



కన్పించని సంక్రాంతి

పల్లె పండుగగా పిలుచుకునే సంక్రాంతి పండుగలో క్రాంతి (వెలుగులు)లేవీ కనిపించడం లేదు. సర్వత్రా నిరాశ, నిస్పృహలు అలుముకున్నాయి. 2023లో వర్షాభావంతో రైతులు పంటలు పూర్తి స్థాయిలో సాగు చేయలేకపోయారు. పెట్టిన పంటలు కూడా పూర్తి స్థాయిలో చేతికిరాకపోవడంతో తీవ్రమైన నిరాశతోనున్నారు. చేతిలో చిల్లిగవ్వ ఆడక సంక్రాంతి పండుగ సందడి పల్లెల్లో కనిపించడం లేదు. మరోవైపు పట్టణాల్లోనూ ఇంచుమించు అదే పరిస్థితి నెలకొంది.

పల్లె పండుగలో కనిపించని సందడి

రైతులు, కార్మికులు, ఉద్యోగుల్లోనూ నిరాశే

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

2023 జూన్ ఖరీఫ్ ప్రారంభం నుంచి వర్షాభావ పరిస్థితులు జిల్లాలో నెలకొన్నాయి. పంటల సాగే 60 శాతం వరకే అయింది. వేసిన పంట కూడా చేతికందలేదు. ప్రభుత్వం కరువు మండలాలు ప్రకటించింది. కాని ఇప్పటి వరకు పంటనష్ట పరిహారం ఇవ్వలేదు. గతంలో ఎన్నడూలేని విధంగా ఈసారి ఆయకట్టు రైతుల్లోనూ ఆందోళన నెలకొంది.సాగునీరు అందక వేసిన పంటలను కాపాడుకోవడానికి అనేక రకాలుగా ఇబ్బందులు, కష్టాలు పడుతున్నారు. నీటిని సుదూర ప్రాంతాల నుంచి ట్యాంకర్ల ద్వారా తెచ్చుకుని పంటను కాపాడుకునే పనిలోనున్నారు. దీంతో రైతు చేతిలో చిల్లిగవ్వలేక పండుగను ఉన్న కాడికి జరుపుకునే పరిస్థితులు నెలకొన్నాయి.

ఉద్యోగులు, కార్మికులకు తప్పని కష్టాలు

ఉద్యోగులు, కార్మికులకు కష్టాలు తప్పడం లేదు. ప్రధానంగా వివిధ విభాగాల్లో పనిచేస్తున్న కార్మికులు సమ్మెలోనున్నారు. అంగన్‌వాడీ, మున్సిపల్, సర్వశిక్షా అభియాన్ ఉద్యోగులు ఇలా అందరూ తమ సమస్యలపై పోరాటాలు సాగించారు. ప్రభుత్వం వారి సమస్యల పరిష్కారానికి ముందుకు రావడం లేదు. సమ్మెలో ఉండటంతో వారికి వేతనాలు అందని పరిస్థితులు నెలకొన్నాయి. అంగన్‌వాడీ కార్మికులు భోగి పండుగ రోజు కూడా సమ్మెలో ఉండి ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకిస్తూ భోగి మంటలు వేసి నిరసన తెలిపారు. దీంతో ఆ కుటుంబాల్లోనూ సంక్రాంతి పండుగ శోభ కనిపించడం లేదు.

పెరిగిన ధరలు

పెరిగిన నిత్యావసర ధరలతో పండుగకు పిండి వంటలు చేసుకోవాలంటే కూడా భయపడి పోయే పరిస్థితి నెలకొంది. ప్రధానంగా సన్న బియ్యం ధర కిలో రూ.55 నుంచి రూ.60వరకు ఉంది. పేదలు రేషన్ బియ్యంతోనైనా సరిపెట్టుకునే పరిస్థితి ఉండగా మధ్యతరగతి వారికి మాత్రం బియ్యం ధరలు కూడా భారమవుతున్నాయి. ఇక శనగపిండి, నూనె, చక్కెర, బెల్లం తదితర నిత్యావసర ధరలు బాగా పెరగడంతో పిండి వంటలు చేసుకోవడానికి కూడా వెనుకాడే పరిస్థితులు నెలకొన్నాయి. ఎప్పుడూ పండుగ సమయాల్లో కళకళలాడే కిరాణా దుకాణాలు, బట్టల వ్యాపారాలు కూడా ఈసారి వెలవెలబోయి కనిపించాయి.

పండుగ పూట.. ధరల మంట..!

ప్రజాశక్తి-హిందూపురం

నిత్యావసర వస్తువుల ధరలు జనానికి చుక్కలు చూపెడుతున్నాయి. తెలుగువారి పెద్ద పండుగ సంక్రాంతి వేళ అందరికీ ఇష్టమైన పిండివంటలకు కష్టాలొచ్చాయి. నూనె ధరలు సలసలకాగుతున్నాయి. కేజీ పామాయిల్ ధర రూ.100కి పైగా ఉందంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఇక పప్పులు పేలుతున్నాయి. బియ్యం, ఇతర సరుకులూ వాటికి పోటీపడుతున్నాయి. కరోనా కాలంలో కొండెక్కిన ధరలు ఎంతకీ తగ్గకపోగా పండుగ సమయంలో ఆకాశాన్నంటాయి. ఇంత జరుగుతున్నా ధరల నియంత్రణ అనేది మచ్చుకు కూడా కని పించడం లేదు. దీంతో వ్యాపారుల ఇష్టారాజ్యమైందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఫలితంగా సామాన్యుల పండుగ పూట సైతం ఆనందం ఆవిరవుతోంది. పేదలైతే పిండివంటలు మర్చిపోవాల్సి వస్తోంది. వందలు కాదు వేల రూపాయలు ఉంటేనే సరుకులు అన్నట్లు పరిస్థితి తయారైంది.

దడ పుట్టిస్తున్న నిత్యావసర ధరలు

సామాన్యులకు నిత్యావసర ధరలు దడ పుట్టిస్తుండగా, కూరగాయల ధరలు కొండెక్కి కూర్చున్నాయి. నెల వ్యవధిలోనే అన్ని రకాల సరుకులు కేజీకి ఏకంగా రూ.10 నుంచి 20వరకూ పెరిగాయి. పండుగకు అందరికీ తప్పనిసరి వంటకమైన అరిసెలకు వంట నూనెల ఎఫెక్ట్ తగిలింది. ఊహించని విధంగా కిలో రూ.130పైనే ఉండటంతో ఆవైపు చూసేందుకే భయపడుతున్నారు. కనీసం పప్పులతో సరిపెట్టుకుందామనుకుంటే పెరిగిన ధరలతో ఏంకొనేటట్లు లేదు. దీంతో సామాన్యులు చాలావరకు ఒకటి, అర వంటకాలతో సరిపెట్టుకుంటున్నారు. ఇక పోతే అందరికి అందుబాటులో ఉండాల్సిన బియ్యం ధరలు బ్యాళ్ల ధరతో పోటీ పడుతున్నాయి. ఏకంగా ఒక క్వింటోలు బియ్యంపై ఒక్క సారిగా రూ.600 వరకు పెరిగింది. ఇక బ్యాళ్ల ధర అయితే రూ.160 దాటింది. ఉల్లి ధర మళ్లీ పెరుగుతోంది. తెల్లవాయిలు అయితే రూ.320 ఉంది. నిత్యం తక్కువకు దొరికే టమోటో రూ.20 ఉంది. ఇలా ప్రతి వస్తువు అమాంతంగా పెరుగుతుంటే సామాన్యులు పండుగలను ఎలా చేయాలో అని తలలు పట్టుకుంటున్నారు.

రెడీమేడ్ వంటకాల వైపు మొగ్గు

ఆకాశాన్నంటుతున్న ధరలతో దుకాణాల్లో సరుకులు కొని తీసుకెళ్లి వంటకాలు తయారుచేయడం పట్టణాల్లో దాదాపు తగ్గిపోయింది. దానికితోడు కుప్పలుతెప్పలుగా వెలుస్తున్న రెడీమేడ్ వంటకాల వైపు మొగ్గు మధ్య తరగతి వారు మొగ్గు చూపుతున్నారు. అయితే అక్కడ సైతం పిండివంటల ధరలు మండిపోతున్నాయి. అదేమంటే ధరలు పెరిగాయనివారూ చెప్తున్నారు. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో పట్టణవాసులు అవసరమైన తినుబండారాల కొనుగోలుకు వెళుతుండడంతో ఆ దుకాణాలు కళకళలాడుతున్నాయి. ముఖ్యంగా మధ్యతరగతి వారే రెడీమేడ్ వంటకాలపై మక్కువ చూపుతున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు. ముఖ్యంగా సంక్రాంతి పండుగ కావడంతో కాలనుగుణంగా ఖర్చును సైతం లెక్కచేయకుండా పెద్ద కుటుంబాల వారు మాత్రమే వంటల ఘుమఘుమను కొనసాగిస్తున్నారు.

ఉద్యమాల 'పెద్దన్న' ఇకలేరు...

పలువురి సంతాపం

ప్రజాశక్తి-అనంతపురం



పెద్దన్న

ఉద్యమాల 'పెద్దన్న'గా పేరొందిన సిపిఐ ఎంఎల్ నాయకులు పెద్దన్న(76) ఆదివారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు. ఆయన మృతికి పలువురు సంతాపం తెలిపారు. 1948 ఆగస్టు ఎనిమిదవ తేదీన యల్లనూరు మండలం చింతకాయమంద గ్రామంలో నాగమ్మ, పక్కీరప్ప దంపతులకు జన్మించారు. ఆయనతో పాటు ఇద్దరు అక్కలు, ఒక చెల్లులు ఉన్నారు. అక్క బిడ్డ వరలక్ష్మిని వివాహం చేసుకున్న ఈయన డిగ్రీ వరకు చదివి వ్యవసాయ శాఖలో ఉద్యోగిగా చేరారు. 1998లో ఉద్యోగానికి రాజీనామా చేసి కమ్యూనిస్టు పార్టీలో చేరారు. తరిమెల నాగిరెడ్డి ప్రభావంతో విద్యార్థి దశ నుంచి ఉద్యమాల్లో ఉంటూ వచ్చారు. ప్రగతిశీల విద్యార్థి సంఘంలో పనిచేస్తూ యుసిసిఆర్ఐ (ఎంఎల్) పార్టీలో చేరారు. ఈ ఉద్యమాల్లో ఉంటూనే ఎన్జీవో సంఘం నాయకుడు గానూ పనిచేశారు. అనంతరం ఆ పార్టీ సిపిఐ ఎంఎల్‌గా రూపొంతరం చెందింది. స్వచ్ఛంద ఉద్యోగ విరమణ తరువాత సిపిఐ ఎంఎల్ జిల్లా కార్యదర్శిగానూ, రాష్ట్ర నాయకులుగానూ పనిచేస్తూ వచ్చారు. తుదిశ్వాస వరకు కూడా వామపక్ష పార్టీలోనే ఎర్రజెండా పట్టుకుని నడిచారు. గత కొంత కాలంగా వయోభారంతో అనేక ఆరోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతూ ఉన్నా వామపక్ష ఉద్యమాల్లో పాల్గొంటూనే వచ్చారు. ప్రస్తుతం జరుగుతున్న అంగన్‌వాడీ కార్మికుల సమ్మెలోనూ పాల్గొని మద్దతు తెలిపారు. వామపక్ష ఐక్య ఉద్యమాల్లోనూ ఆయన అగ్రభాగాన ఉంటూ ప్రజా సమస్యల కోసం పోరాడుతూ వచ్చారు. ఈనేపథ్యంతో పెద్దన్న ఆదివారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు. ఆయన భౌతికకాయాన్ని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.రాంభూపాల్, రాష్ట్ర నాయకులు జి.ఓబులు, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసి నాయకులు ఇండ్ల ప్రభాకర్‌రెడ్డి, మానవ హక్కుల వేదిక నాయకులు ఎస్ఎం.బాషా, అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి తదితరులు సందర్శించి నివాళులు అర్పించారు.

వామపక్ష ఐక్య ఉద్యమాలకు తీరని లోటు : వి.రాంభూపాల్ సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు

సిపిఎం ఎంఎల్ రాష్ట్ర నాయకులు పెదన్న మృతి వామపక్ష ఐక్య ఉద్యమానికి జిల్లాలో తీరని లోటు అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.రాంభూపాల్ విచారం వ్యక్తం చేశారు. జిల్లా కమ్యూనిస్టు ఉద్యమానికి పెద్ద దిక్కుగా ఉంటూ ఎవరి తప్పునైనా నిక్కచ్చిగా అంతర్గత సమావేశాల్లో ఎత్తి చూపేవారని తెలిపారు. అంతేకాకుండా ప్రజాసమస్యలపై ఏ కమ్యూనిస్టు పార్టీ పోరాడినా మనస్పూర్తిగా స్వాగతిస్తూ, తగిన సలహాలు, సూచనలిచ్చేవారని గుర్తు చేశారు.

లేపాక్షికి యునెస్కో గుర్తింపు లభించేనా..?

ప్రజాశక్తి-హిందూపురం

ఈ నెల 16న మంగళవారం జిల్లాకు వస్తున్న దేశ ప్రధాని నరేంద్ర మోదీ ప్రముఖ పర్యాటక కేంద్రం లేపాక్షిని సందర్శించనున్నారు. స్వయాన ప్రధానమంత్రి లేపాక్షి విశిష్టతను తెలుసుకొని పర్యటించాలని నిర్ణయం తీసుకోవడం వెనుక ఆలోచన ఏమి అన్నది అర్థం కావడం లేదు. ముఖ్యంగా వచ్చేనెల 22వ తేదీన అయోధ్యలో శ్రీరామ మందిరం అంగరంగ వైభవంగా ప్రారంభించేందుకు బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. నూతనంగా అత్యంత సుందరంగా నిర్మించిన అయోధ్య శ్రీరామ మందిరం ప్రారంభోత్సవాన్ని కూడా ప్రధాని నరేంద్ర మోదీ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. రామాయణం ఇతిహాసంలో సీతాదేవిని రావణాసురుడు ఎత్తుకెళుతున్న సందర్భంలో లేపాక్షి వద్ద జటాయువు అడ్డు తగిలి నిలువరించేందుకు ప్రయత్నించిందని చరిత్ర చెబుతోంది. దీంతో ఆగ్రహావేశాలకు గురైన రావణాసురుడు ఆ జటాయువును తన ఖడ్గంతో చీల్చడంతో ప్రాణాపాయ స్థితిలో నేలకొరిగినట్లు చరిత్ర ఉంది. తదనంతరం సీతమ్మ జాడ కోసం అటుగా వస్తున్న శ్రీరాముడు జటాయువును చూసి ఏమి జరిగిందంటూ అడగగా జరిగిన విషయాన్ని చెప్పడం... ప్రాణాపాయ స్థితిలో ఉన్న జటాయును ఉద్దేశించి లే.....పక్షి అంటూ ఆశీర్వాదం చేయడంతో మళ్లీ ఆ జటాయువు ప్రాణవాయువు పొందినట్లు చరిత్రకారులు చెబుతున్నారు. లేపాక్షి చరిత్ర తెలుసుకున్న ప్రధాని మోదీ ఆలయాన్ని సందర్శించాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా అధికార యంత్రాంగం ప్రధాని పర్యటనకు అవసరమైన చర్యలు చేపడుతోంది. జిల్లా కలెక్టర్, ఎస్పీ, ప్రధాని ప్రత్యేక సెక్యూరిటీ బృందం, ఉన్నతాధికారులు ఆదివారం లేపాక్షి కి వచ్చి ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు. అయితే ఎప్పటి నుంచో లేపాక్షి ఆలయం యునెస్కో గుర్తింపు కోసం పోటీలో ఉంది. ప్రధాని పర్యటనతోనైనా లేపాక్షికి యునెస్కో గుర్తింపు లభించడంతో పాటు లేపాక్షికి మహర్దశ పడుతుందా అని చరిత్రకారులు ఆశిస్తున్నారు.



లేపాక్షి ఆలయంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, జిల్లా అధికారులు

ప్రధాని పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు : జేసీ



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ

ప్రజాశక్తి పుట్టపర్తి రూరల్

ఈ నెల 16న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తదితరులు జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో అన్నీ ఏర్పాట్లను సోమవారం లోపు సంసిద్ధం చేసి కార్యక్రమాలు విజయవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ అధికారులను ఆదేశించారు. ఆదివారం గోరంట్ల మండలం పాలసముద్రం సమీపంలోని నాసిన్ కేంద్రంలో పలు శాఖాధికారులతో జాయింట్ కలెక్టర్ సమన్వయ సమావేశం నిర్వహించి పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ నాసిన్ కేంద్రాన్ని ప్రధాన మంత్రి సందర్శిస్తున్నారని ఈ నేపథ్యంలో రాష్ట్ర గవర్నర్, రాష్ట్ర ముఖ్యమంత్రి, కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ప్రజా ప్రతినిధులు,ఇతర ప్రముఖులు కూడా హాజరు కానున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో ఆయా కార్యక్రమాలకు సంబంధించి అన్ని రకాల పనులు సోమవారం మధ్యాహ్నం పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ పలు శాఖాధికారులకు ఆదేశించారు. ముఖ్యంగా నాసిన్, ఎస్‌జిపి అధికారుల సహకారంతో ప్రధానిమంత్రి షెడ్యూల్ ప్రకారం కార్యక్రమాల వివరాలు ముందస్తుగా గుర్తించి అవసరమైన మేరకు పనులు పూర్తి చేయాలన్నారు. నాసిన్ ప్రాంగణంలో వివిధ చోట్ల 3 హెలీపాడ్లను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కాన్వాయ్, విఐపి గ్యాలరీ, ప్రోటోకాల్, పోలీస్ భద్రత, ప్రధాన మంత్రి సందర్శించే పలు విభాగాల పనుల్లో ఏలాంటి లోటు పాట్లు లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రెవెన్యూ , అగ్ని మాపక శాఖ ద్వారా చేపట్ట వలసిన పనులు, శానిటేషన్, పోలీస్ భద్రత, ఆర్ అండ్ బి, ఫుడ్ సేఫ్టీ, నిరంతర విద్యుత్ సరఫరా, పౌసరఫరాలశాఖ, ఐ అండ్ పి ఆర్ మీడియా, సౌండ్ సిస్టం పర్యవేక్షణ, ట్రాఫిక్ క్రమ బద్ధికరణ, వాహనాల పార్కింగ్ తదితర అంశాలపై దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. విధులు నిర్వర్తిస్తున్న అధికారులు, ఉద్యోగులు ముందస్తు అనుమతి పొందాలని సూచించారు. 74, 75వ బ్యాచుల ఆఫీసర్ ట్రైనీలతో ముఖాముఖి కార్యక్రమంలో ప్రధాని పాల్గొంటారన్నారు. అనంతరం జరిగే సభలో ప్రసంగించిన అనంతరం ప్రధాని మోడీ ఢిల్లీకి బయలుదేరి వెళ్తారని జాయింట్ కలెక్టర్ తెలిపారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని అప్పగించిన పనులను బాధ్యతగా నిర్వర్తించి కార్య క్రమాలు విజయ వంతం చేయాలని జాయింట్ కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో ఆర్డీవోలు భాగ్యరేఖ, వంశీ, రమేష్ రెడ్డి, జిల్లా అగ్ని మాపక శాఖ అధికారి హేమంత్ రెడ్డి, ట్రాన్స్‌పోర్ట్ అధికారి కరుణ సాగర్, డిపిఒ విజయ కుమార్, ఎపిఐఐసి జోనల్ మేనేజర్ సోనీ, సాంఘిక సంక్షేమ శాఖ సాధికారత అధికారి శివరంగప్రసాద్, డిఐపిఆర్ఒ వేలాయుధం, డిఎంహెచ్ఒ ఎస్వీ కృష్ణారెడ్డి తదతర జిల్లా స్థాయి అధికారులతో పాటు తహశల్దార్లు రంగ నాయకులు, సురేష్, డిఐసి జనరల్ మేనేజర్ చాంద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వసతిగృహాలకు మహర్దశ

సాంఘిక సంక్షేమ శాఖ పీడీ శివరంగ ప్రసాద్





ప్రజాశక్తి పుట్టపర్తి రూరల్

శ్రీ సత్య సాయి జిల్లాలో ఉన్న 26 సాంఘిక సంక్షేమ హాస్టల్ల రూపురేఖలు త్వరలో మారనున్నాయని సాంఘిక సంక్షేమ శాఖ పీడీ శివ రంగ ప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన ప్రజాశక్తి కిచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో పలు విషయాలను వెల్లడించారు.

ప్రశ్న: శ్రీ సత్య సాయి జిల్లాలో ఎన్ని హాస్టల్లో ఉన్నాయి. వాటిలో ఫ్రీ మెట్రిక్ పోస్ట్ మెట్రిక్ హాస్టళ్లు ఎన్ని ?

జవాబు : శ్రీ సత్య సాయి జిల్లా వ్యాప్తంగా 26 సాంఘిక సంక్షేమ హాస్టల్లో ఉన్నాయి. వాటిలో మూడు నుండి పదవ తరగతి విద్యార్థుల కోసం ఏర్పాటుచేసిన హాస్టళ్లు బాలురకు 12 బాలికలకు ఐదు ఉన్నాయి. పోస్ట్ మెట్రిక్ హాస్టళ్లు ఇంటర్మీడియట్ చదివే బాలికలకు ఐదు బాలురకు నాలుగు ఉన్నాయి.

ప్ర: విద్యార్థులకు కాస్మోటిక్ చార్జీలు సరిగా అందుతున్నాయా.?

జ : గతంలో మాదిరి కాకుండా విద్యార్థులకు నెలనెలా కాస్మొటిక్ చార్జీలను డిసెంబర్ వరకు వారి తల్లుల ఖాతాల్లో జమ చేశాం. మెస్‌చార్జీల విషయానికి వస్తే గతంలో ఉన్న చార్జీల కంటే ఇప్పుడు కొంత మేర పెంచాం. వాటివల్ల ప్రభుత్వం ఇచ్చిన మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నాం. భోజనం అందించే విషయంలో కొన్నిచోట్ల సమస్యలు మా దృష్టికి వచ్చాయి. ఆ సమస్యలు పరిష్కరించేందుకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. త్వరలో ప్రభుత్వం మెస్ చార్జీలను పెంచే ఆలోచనలో ఉంది.

ప్ర : అవుట్‌సోర్సింగ్ సిబ్బంది వేతనాలు ఎప్పుడు మంజూరు చేస్తారు.

జ : సాంఘిక సంక్షేమ హాస్టల్ పరిధిలో రెండు రకాల అవుట్‌సోర్సింగ్‌ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తున్నారు. ఒకటి మూడు నుండి పదవ తరగతి వరకు ఉన్న అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి ఆప్కార్డ్ నుండి నెలనెలా వేతనాలు అందుతున్నాయి. జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న సిబ్బందికి నెల నెల వేతనాలు అందడం లేదు. వారికి మదర్‌థెరిసా ట్రస్ట్ నుండి వేతనాలు అందించాల్సి ఉంది. ప్రభుత్వం గ్రాంటు విడుదల చేస్తే మదర్‌థెరిసా ట్రస్ట్ కు బదలాయింపు చేసి వారికి వేతనాలను మంజూరు చేస్తారు.

ప్ర : హాస్టళ్ల అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలేవి.?

జ : హాస్టళ్ల అభివృద్ధికి ప్రభుత్వం ఎన్నో చర్యలు చేపట్టింది. ప్రధానంగా అద్దె భవనాల్లో ఉన్న వసతి గృహాలపై దృష్టి పెట్టింది. నాడు నేడు కింద హాస్టళ్ల భవనాలు నిర్మించి హాస్టళ్లను ఉత్తమ స్థాయిలో తీర్చిదిద్దాలన్న దృక్పథంతో ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలు చేపడుతోంది. పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి సౌకర్యవంతంగా హాస్టళ్లను ఏర్పాటు చేసి నాణ్యమైన విద్యను అందించనుంది.

'పురం'లో మహిళలకు ప్రాధాన్యత...

ప్రజాశక్తి-హిందూపురం


తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి ఇప్పటి వరకు ఓటమి ఎరుగని కోట హిందూపురం శాసనసభ నియోజక వర్గం. 1952లో నియోజక వర్గం ఏర్పడి నప్పటి నుంచి ఇప్పటి వరకు 18 సార్లు అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. ఈ నియోజక వర్గనికి ఒక ప్రత్యేక గుర్తింపు ఉంది. ఇక్కడి నుంచి స్వాతంత్ర్య సమరయోధులు కల్లూరు సుబ్బారావు, టిడిపి వ్యవస్థాపక అధ్యక్షులు ఎన్టీఆర్ లాంటి వారు ఇక్కడి నుంచి పోటీ చేశారు. అదే విధంగా హిందూపురం పార్లమెంటు స్థానానికి సైతం ఒక ప్రత్యేక గుర్తింపు వుంది. 1952వ సంవత్సరంలో లోక్‌సభ నియోజకవర్గం ఏర్పడింది. 1967వ సంవత్సరంలో నీలం సంజీవరెడ్డి ఇక్కడి నుంచి ప్రాతినిధ్యం వహించారు. ఇప్పటి వరకు 17 సార్లు లోక్‌సభ ఎన్నికలు జరగగా ఇందులో 9 సార్లు కాంగ్రెస్ పార్టీ, ఒక సారి కాంగ్రెస్ (ఐ), ఒకసారి కెఎమ్‌పిపి, ఐదు సార్లు టిడిపి గెలుపొందింది. 2019 జరిగిన ఎన్నికలలో లోక్‌సభ స్థానం వైసిపి కైవశం చేసుకుంది. 2024లో జరగనున్న ఎమ్మెల్యే ఎన్నికల్లో టిడిపి కంచుకోటను బద్దలు గొట్టి వైసిపి కైవశం చేసుకోవాలని, అదే విధంగా రెండవ సారి పార్లమెంట్ ఎన్నికల్లో విజయడంఖా మోగించాలని భావిస్తోంది. చరిత్రలో ఎప్పుడు లేని విధంగా తొలి సారిగా ఈ రెండు స్థానాలకు అధికార వైసిపి మహిళా అభ్యర్థులను రంగంలోకి దించనుంది.

రెండు స్థానాలను మహిళలకే....

ఇప్పటి వరకు హిందూపురం పార్లమెంటు, శాసనసభ చరిత్రలో మహిళా అభ్యర్థులు పోటీలో లేరు. అయితే అధికార వైసిపి ఈ సారి జరిగే పార్లమెంట్ (లోక్ సభ), ఎమ్మెల్యే(శాసనసభ) స్థానాలకు మహిళా అభ్యర్థులను బరిలో దించనుంది. ఇటీవల ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి సమక్షంలో వైసిపిలోకి చేరిన మాజీ ఎంపీ శాంతను పార్లమెంట్ ఇన్‌చార్జ్‌గా నియమించింది. ఈ ప్రకటన చేసిన వెంటనే తిరుపతిలో మంత్రి పెది రెడ్డి రామచంద్రా రెడ్డిని సైతం ఈమె కలిశారు. అధిష్టానం నుంచి ఆదేశాలు రాకపోయినా శాసనసభ స్థానానికి నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్న హిందూపురం రూరల్ మండలం గుడంపల్లికి చెందిన వేణు రెడ్డి భార్య కురుబ దీపిక పేరే బలంగా వినిపిస్తోంది. ఈమెకు పార్టీ రాయలసీమ కో ఆర్డినేటర్ మంత్రి పెద్ది రెడ్డి రామచంద్రా రెడ్డి ఆశీస్సులు ఉన్నాయి. దీంతో ఈమెకే టికెట్ తప్పక వరించే అవకాశాలు కనిపిస్తున్నాయి. వీరిద్దరు వచ్చే ఎన్నికల్లో అసెంబ్లీ, పార్లమెంట్ బరిలో ఉంటున్నారు.

టిడిపి దారేటు..?

ఇప్పటికే వచ్చే ఎన్నికల్లో అధికార వైసిపి మహిళా అభ్యర్థుల పేర్లు ఖరారు చేశారు. అయితే ప్రధాన ప్రతి పక్షంలో ఉన్న టిడిపి మహిళా అభ్యర్థులనే బరిలో దింపనుందా లేదా అన్నది ఇంత వరకు ప్రకటించలేదు. అయితే హిందూపురం అసెంబ్లీ స్థానానికి బాలకృష్ణ బరిలో ఉంటున్నారు. దీని కోసమే గత నెల చిలమత్తూరు, లేపాక్షి మండలాల్లో ముఖ్య నేతలతో సమీక్షా సమావేశం నిర్వహించి, ఎన్నికలకు సిద్దం కావాలని చెప్పకనే చెప్పారు. అయితే పార్లమెంట్ స్థానానికి మహిళా అభ్యర్థినే బరిలో దింపుతారా..? లేదా మడకశిరకు చెందిన మాజీ ఎమ్మెల్సీ యాదవ సామాజిక వర్గానికి చెందిన తిప్పేస్వామి, బోయ సామాజిక వర్గానికి చెందిన అంబికా లక్ష్మి నారాయణ, కురుబ సామాజిక వర్గానికి చెందిన చెందిన మాజీ ఎమ్మెల్యే పార్థసారథిని బరిలో దింపుతారా అన్నది ఇప్పటి వరకు ప్రకటించలేదు. ఒకవేళ మహిళనే పోటీలో దింపితే పెనుకొండకు చెందిన కురుబ సామాజిక వర్గానికి చెందిన సబితను బరిలోకి తీసుకు వస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ఈమె పెనుకొండ ఎమ్మెల్యే స్థానాన్ని కోరుతున్నట్లు సమాచారం. అందుకోసమే పెనుకొండ నియోజక వర్గ వ్యాప్తంగా ఇప్పటికే పలు సేవా కార్యక్రమాలతో పాటు చురుకైన నాయకురాలిగా పనిచేస్తోంది. అయితే పెనుకొండ అసెంబ్లీ స్థానం తనకే కావాలని పార్థసారథి గట్టిగా ప్రయత్నం చేస్తున్నట్లు సమాచారం. పార్థసారథికి టికెట్ ఇస్తే సబితమ్మ వర్గం పని చేస్తుందా లేదా అన్న అనుమానాలు ఉన్నాయి. దీంతో టిడిపి అధిష్టానం సబితమ్మను పార్లమెంట్‌కు పొంపి పార్థ సారథిని ఎమ్మెల్యేగా బరిలో దింపాలన్న ఆలోచనలో ఉంది. ఇదే నియోజకవర్గం సోమందేపల్లి మండలం మేకలపల్లి కురుబ కృష్ణమూర్తికి సైతం నియోజక వర్గంలో మంచి పేరుంది. పార్టీ సీనియర్ నాయకులుగా వుంటూ, రాష్ట్ర కురుబ సంఘం అసోసియేట్ ప్రెసిడెంట్‌గా కొనసాగుతున్నారు. ఈయన అటు పెనుకొండ నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్తిత్వంతో పాటు హిందూపురం పార్లమెంట్ స్థానాన్ని సైతం ఆశిస్తున్నారు. రెండింటిలతో ఏదో ఒకటి వరిస్తుందన్న భావనతో తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు. 2014 ఎన్నికల్లో ఎంపీ టికెట్ కోసం తీవ్రంగా ప్రయత్నించారు. అయితే చివరి నిమిషంలో నిమ్మల క్రిష్టప్పకు పార్టీ కేటాయించడం తెలిసిందే. ఇకపోతే వడ్డెర సామాజిక వర్గానికి చెందిన కొల్లకుంట అంజినప్ప సైతం ఎంపీ టికెట్ కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. వీరితో పాటు మరో సారి అవకాశం కల్పించాలని మాజి ఎంపీ నిమ్మల కిష్టప్ప కోరుకుంటున్నారు. అంతేకాకుండా తన తనయుడు అంబ్రీష్‌కు పుట్టపర్తి అసెంబ్లీ టికెట్ ఇవ్వాలని అధిష్టానానికి ఇప్పటికే విన్నవించారు. హిందూపురం పార్లమెంట్ వ్యాప్తంగా టిడిపిలో మహిళల పోటీ తక్కువగానే కనిపిస్తోంది. మహిళా ఓటర్లను ఆకర్షించడానికి ఇప్పటికే అధికార వైసిపి పార్లమెంట్‌తో పాటు హిందూపురం, పెనుకొండ అసెంబ్లీ స్థానాలను మహిళలకు కేటాయించారు. ఈ నేపథ్యంలో టిడిపి ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాల్సుంది.



శాంత దీపిక సబిత



అనంతపురంలో భోగిమంటలు వేసుకుంటున్న మాజీ ఎమ్మెల్యేగోనుగుంట్ల దంపతులు

'గోనుగుంట్ల' ఇంట భోగి సంబరాలు

ధర్మవరం టౌన్ : సంక్రాంతి పండుగ సందర్భంగా ఆదివారం మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్య నారాయణ అనంతపురం నగరంలోని తన నివాసంలో కుటుంబ సభ్యులతో భోగి సంబరాలు చేసుకు న్నారు. సూర్యనారాయణ, సతీమణి గోనుగుంట్ల నిర్మల, తనయుడు నితిన్‌సాయిలు తెల్లవారు జామున భోగి మంటలు వేసి పూజలు చేశారు. గోనుగుంట్ల మాట్లాడుతూ ప్రజలందరి జీవితాల్లో కష్టాలు, చెడు ప్రభావాలు తొలగి భోగభాగ్యాలు కలగాలని కోరుకుంటూ భోగి పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

నేడు శిల్పారామంలో సంక్రాంతి సంబరాలు

పుట్టపర్తి రూరల్ : ఈ నెల 15వ తేదీ స్థానిక శిల్పారామంలో సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్నట్లు శిల్పారామం పరిపాలన అధికారి రమేష్‌రెడ్డి తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి, ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారికి బహుమతులు అందజేస్తామన్నారు. 16వ తేదీ సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకూ జబర్దస్ట్ ఆర్టిస్టు సునామీ సుధాకర్‌చే కామెడీ ప్రోగ్రాం, మదనపల్లి కళా తరంగిణి వారిచే నృత్య ప్రదర్శనలు ఉంటాయ న్నారు.

నీటి సమస్య పరిష్కారం

కదిరి టౌన్ : రూరల్ మండల పరిధిలోని కుమ్మరవాండ్లపల్లి గ్రామపంచాయతీలో నీటి సమస్యను ఎమ్మెల్యే సిద్ధారెడ్డి దృష్టికి తీసుకెళ్లటంతో స్పందించారు. సర్పంచి ఆధ్వర్యంలో ఆదివారం బోరు బావి తవ్వించారు. దీంతో నీటి సమస్యకు పరిష్కారం లభించింది. కార్యక్రమంలో యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మణికంఠ నాయక్, గ్రామస్తులు పాల్గొన్నారు.

రైళ్లలో జీఆర్పీ పోలీసుల తనిఖీలు

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

ధర్మవరం రైల్వే జంక్షన్‌కు వచ్చే ప్రతి రైలును ఆదివారం జీఆర్పీ పోలీసులు తనిఖీ చేశారు. జీఆర్పీ సీఐ నాగరాజు ఆధ్వర్యంలో ఎస్‌ఐ గోపీకుమార్, సిబ్బంది రైలు బోగీలను క్షుణ్ణంగా సోదాలు చేశారు. సీఐ మాట్లాడుతూ ఈ నెల 22వ తేదీ అయోధ్యలో రాముని విగ్రహ ప్రతిష్ట ఉన్నందున అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పకడ్బందీగా తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. పార్సిల్ సర్వీసు కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ప్రయాణికుల వద్ద ఉన్న బ్యాగులను తనిఖీ చేస్తూ అనుమానాస్పద వ్యక్తుల వివరాలు సేకరించామన్నారు. ఈ నెలంతా తనిఖీలు చేపడుతామని సీఐ తెలిపారు.

'నొళంబవాడి' పుస్తకావిష్కరణ

అమరాపురం : అమరాపురంలో ఆదివారం రచయిత సిద్ధగిరి శ్రీనివాస్ 'నొళంబ వాడి' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని హేమావతి గ్రామం 8వ శతాబ్దం నుంచి 11 శతాబ్దం వరకూ మహా పట్టణంగా వెలుగొందిందన్నారు. పల్లవ వంశానికి చెందిన నొళంబులు హేమావతి రాజధానిగా 'నొళంబవాడి'(ఎపి, కర్నాటక, తమిళనాడులోని ప్రాంతాలు)గా పిలువబడే ప్రాంతాన్ని 300ఏళ్లకు పైబడి పాలించారన్నారు. హేమావతిని శిల్ప కళా విశ్వవిద్యాలయంగా నిలిపి వ్యవసాయాభివృద్ధికి చెరువులు తవ్వించారన్నారు. అనంతరం హెంజేరు సిద్ధేశ్వరుడిని దర్శించుకుని పుస్తక ప్రతులను అర్చకులు, పురప్రముఖులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపిపి ఈరన్న, రామాంజనేయులు, నాగరాజు, గోవిందరాయలు, సిద్ధేశ్వర, అంబరీష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన

అమరాపురం : భారత్ వికసిత్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఎంపిడిఒ మునిస్వామి ఆధ్వర్యంలో మండల పరిధిలోని వలస, అగ్రహారం, హల్కూరు గ్రామ సచివాలయాల ప్రాంగణాల్లో కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆయు ష్మాన్ భవ కార్డులు పంపిణీ చేసి, ప్రధానమంత్రి ఆవాస్ యోజన క్యాలెండర్‌ను ఆవిష్కరించి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు వీరన్న, మహేష్, ఎపిఎం తిప్పేస్వామి, తపాలా అధికారి మధుసూదన్, ఎఎన్‌ఎం వాణి, ఇన్‌ఛార్జి ఎపిఒ ఎంగ్రీ, అగ్రికల్చర్ అసిస్టెంట్ రంగనాథ, యానిమే టర్లు, మహిళా సంఘాల ప్రతినిధులు, రైతులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, సీసీలు, గ్యాస్ ఏజెన్సీ అసిస్టెంట్ రవి, పాల్గొన్నారు.

కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేయాలి

హిందూపురం : పట్టణంలోని న్యాయవాది రవికుమార్‌పై దాడి చేసిన వన్‌టౌన్ హెడ్ కానిస్టేబుల్ మహేష్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని దళిత, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. న్యాయవాదిపై దాడిని ఖండిస్తూ ఆదివారం పట్టణంలో ర్యాలీ నిర్వహించి, అంబేద్కర్ సర్కిల్‌లో నిరసన తెలిపారు. కార్యక్రమంలో బాధితుడు రవికుమార్, శ్రీరాములు, రామాంజనప్ప, హరి, నారాయణ, రాజకీయ పార్టీల నాయకులు రవికుమార్, హనుమంతరాయప్ప, అంజి, బాబాఫకృద్దీన్, ముత్యాలప్ప, అశ్వత్థప్ప, దండోరా నాయకులు రాము, రామాంజి, నాగప్ప, శీనప్ప, చిరు, చిన్నప్ప, రామాంజి పాల్గొన్నారు.

ఎస్మా, జిఒ-2 ప్రతులలో అంగన్వాడీల భోగి మంటలు

ప్రజాశక్తి-హిందూపురం

అంగన్వాడీల నిరవధిక సమ్మె ఆదివారం నాటికి 34వ రోజుకి చేరింది. జిల్లా వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లో సమ్మె శిబిరాల్లో ముగ్గులు, భోగి మంటలు వేసి నిరసన తెలిపారు. సమస్యలు పరిష్కారమయ్యే వరకూ సమ్మె కొనసాగిస్తామని తేల్చి చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రయోగించిన ఎస్మా, జిఒ-2 ప్రతులతో పాటు విధుల నుంచి తొల గిస్తామంటూ ఇచ్చిన షోకాజు నోటీసులను అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు స్థానిక సద్భావనా సర్కిల్ వద్ద భోగిమంటల్లో వేసి తగలబెట్టారు. అనంతరం వేతనాల్లో కోత విధించి, వేతనాలు పెంచకపోతే గంజి నీళ్లు తాగి బతకాలా అంటు నినాదా లు చేస్తూ గంజి నీళ్లు తాగుతూ నిరసన తెలపారు. వీరికి ఎపి అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు కార్యదర్శి లావణ్య నేతృత్వం వహించారు. రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని, లేనిచో ఈ నెల 17వ తేదీ తర్వాత ప్రజా సంఘాలు, ప్రజల మద్దతు కూడగట్టుకుని పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకురాళ్లు శిరీష, శైలజ, గీతావాణి, భారతి, పద్మ, వరలక్ష్మి, నాగమ్మ, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

చిలమత్తూరు : అంగన్వాడీలు స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు భోగి మంటల్లో జిఒ-2 ప్రతులు వేసి దహనం చేశారు. గ్రామాల్లో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో అంగన్వాడీ సంఘం నాయకురాళ్లు శోభమ్మ, పద్మావతి, వనజమ్మ, బృందమ్మ, తదితరులు పాల్గొన్నారు.



హిందూపురంలో వేతనాలు పెంచకపోతే గంజి తాగి బతకాలా అని ప్రశ్నిస్తున్న అంగన్వాడీలు

రొద్దం : సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీలు ఎస్మా, జిఒ-2 పత్రాలు భోగిమంటల్లో వేసి నిరసన వ్యక్తం చేశారు. వీరికి సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్ సంఘీభావం తెలిపా మాట్లాడారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ ప్రాజెక్టు అధ్యక్షులు జయమ్మ, సెక్టార్ లీడర్లు అనిత, అరుణ, ఆదిలక్ష్మి, నర్మద, నవిత, పరిమళ, గంగమ్మ, మంజు పాల్గొన్నారు.



హిందూపురంలో భోగి మంటల్లో ఎస్మా చట్ట ప్రతులను దహనం చేస్తూ...



రొదంలో ..



చిలమత్తూరులో..

ఎపిలో విధ్వంస, అరాచక పాలన : టిడిపి

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

రాష్ట్రంలో విధ్వంస, అరాచక పాలన సాగుతోందని టిడిపి నాయకులు మండిపడ్డారు. వైసిపి ప్రభుత్వం తెచ్చిన ప్రజా వ్యతిరేక జిఒ, చంద్రబాబు అక్రమ అరెస్టుకు సంబంధించిన ఎఫ్ఐఆర్ ప్రతుల ను ఆదివారం టిడిపి నాయకులు భోగి మంటల్లో దహనం చేసి సైకో పోవాలి, సైకిల్ రావాలంటూ నినదించారు. వారు మాట్లాడుతూ రాష్ట్రంలో హక్కుల కోసం పోరాడుతున్న పౌరులపై ప్రభుత్వం దౌర్జన్యకాండ సాగిస్తోందన్నారు. ఇసుక, మద్యం, ల్యాండ్ అండ్ సాండ్ మాఫియాలతో వైసిపి ప్రభు త్వం పూర్తిస్థాయిలో అవినీతిలో కూరుకుపోయిందన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి విజయం సాధించి ప్రజా రంజక ప్రభుత్వం రాబోతుందని, చంద్రబాబు సిఎం అవుతారన్నారు. భవిష్యత్తులో ప్రజలు వైసిపిని బంగాళాఖా తంలో కలపడం ఖాయమన్నారు. కార్యక్రమంలో నాయకులు కమతం కాటమయ్య, ఫణికుమార్, పరిశే సుధాకర్, పురుషోత్తంగౌడ్, భీమనేని ప్రసాద్‌నాయుడు, రాళ్లపల్లి షరీఫ్, అంబటి సనత్, గరుగు వెంగప్ప, శీలామూర్తి, బొట్టు కిష్ట, మారుతిస్వామి, కరెంటు ఆది, మాధవరెడ్డి, పల్లపు రవీంద్ర, శివశంకర్, కేశగాళ్ల శీన, ఆడ్రా మహేశ్, కేతినేని రాజ, అశోక్, తోట నారాయణస్వామి, టైలర్ గోపాల్, గంగాధర్, మాబు, ఎన్‌బికె హరి పాల్గొన్నారు.

రాష్ట్రానికి పట్టిన కీడు తొలగాలి ఎపి వెలగాలి

ముదిగుబ్బ : వైసిపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక నిర్ణయాలను నిరసిస్తూ 'రాష్ట్రానికి పట్టిన కీడు తొలగాలి.. ఎపి వెలగాలి' అని కాంకిస్తూ ఆదివారం టిడిపి ఆధ్వర్యంలో వివిధ సమస్యలకు సంబంధించిన కరపత్రా లను భోగి మంటలో వేసి దహనం చేశారు. టిడిపి పట్టణ అధ్యక్షులు తుమ్మల మనోహర్ మాట్లాడు తూ జగన్ ప్రభుత్వం పన్నులు, విద్యుత్ బిల్లులు ఎడాపెడా పెంచిందని, జాబ్ క్యాలెండర్ ప్రకటించక పోవడంతో పాటు ప్రజలు, మహిళలు, యువత, రైతులను నట్టేట ముంచిందని ఆరోపించారు. కనీసం రోడ్డుపై గుంతలు పూడ్చకపోవడంతో ప్రమాదాలు జరిగి ప్రజల ప్రాణాలు పోతున్నా పట్టించుకోలేని పరిస్థితిలో జగన్ పరిపాలన చేయడం మన దౌర్భాగ్యమన్నారు. భోగి మంటలతో రాష్ట్రానికి పట్టిన కీడు పోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో చికెన్ తిరుపాలు, ఎం.నారాయణస్వామి, గడ్డం మోహన్, రామయ్య, సురేష్, ఎ.వెంకటనాయుడు, నంద, అమీర్, కిష్టప్ప, గాజుల చంద్ర, దాదు, కృష్ణ, అబ్దుల్ రజాక్, సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



పుట్టపర్తిలో వైసిపి చీకటి జిఒ ప్రతులను భోగి మంటల్లో వేస్తున్న టిడిపి నాయకులు

వైసిపి చీకటి జిఒ ప్రతులు భోగి మంటల్లో దహనం

పుట్టపర్తి అర్బన్ : సైకో పాలనకు ఇదే చివరి సంక్రాంతి అని, వచ్చే ఎన్నికల్లో సైకో పాలనకు ప్రజలు చమర గీతం పాడడానికి సిద్ధంగా ఉన్నారని టిడిపి నాయకులు పేర్కొన్నారు. వైసిపి పాలనలో జారీ చేసిన చీకటి జిఒలు, జాబ్ క్యాలెండర్ల హామీ ప్రతులను ఆదివారం పట్టణ టిడిపి అధ్యక్షుడు రామాంజనేయులు ఆధ్వర్యంలో స్థానిక పార్టీ కార్యాలయం ముందు భోగి మంటల్లో వేసి నిరసన తెలిపారు. నాయకులు మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం ఖాళీ పోస్టులు భర్తీ చేయకుండా నిర్లక్ష్యం వహించిందన్నారు. ఉద్యమించిన యువతపై అక్రమ కేసులు పెడుతున్నారని విమర్శించారు. కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు యువత కార్యనిర్వహణ కార్యదర్శి అంబులెన్స్ రమేష్, బుజ్జిబాబు, పోతన్న, సాయికుమార్, శ్రీరాములు, బాలకృష్ణ పాల్గొన్నారు.

బత్తలపల్లి : సిఎం జగన్ ప్రజా వ్యతిరేక పాలన కాలి బూడిదవ్వాలని కోరుకుంటూ స్థానిక వినాయక నగర్‌లో వైసిపి ప్రభుత్వ వైఫల్యాలపై ముద్రించిన కరపత్రాలను భోగి మంటల్లో వేసి దహనం చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు నెట్టెం రమణ, బత్తల మనోజ్, హరి, ఈశ్వరమ్మ, గోవిందు, ముళ్లగూరు చిరంజీవి, అంజలి, జాస్తి వంశీ, లక్ష్మీదేవి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఉషశ్రీచరణ్

కుటుంబ సభ్యురాలిగా ఆదరించండి : మంత్రి

ప్రజాశక్తి-రొద్దం

మీ కుటుంబంలో సభ్యురాలిగా భావించి ఆదరించాలని మంత్రి ఉషశ్రీచరణ్ ప్రజలను కోరారు. ఆమె ఆదివారం మండల పరిధిలోని కె.మరవపల్లి గ్రామంలో కనకదాసు విగ్రహానికి పూలమాల వేసి ఆవిష్కరించారు. కలిపి గ్రామంలో ముత్యాలమ్మ ఆలయంలో పూజలు నిర్వహించి, అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. శేషాపురం, బూదిపల్లి, రొప్పాల, పి.కొత్తపల్లి, పెద్దమంతూరు, చెరుకూరు, ఉప్పరపల్లి, లక్కసానిపల్లి, తిమ్మాపురం, చిన్నమంతూరు గ్రామాల్లో పర్యటించి దందేపల్లి గ్రామంతో ముగించారు. మంత్రి ఆయా గ్రామాల్లో ప్రజలతో ఆత్మీయ సమావేశాలు నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ సిఎం జగన్ పేదల పక్షపాతి అని కొనియాడారు. సంక్షేమ పథకాలను పారదర్శకంగా డోర్ డెలివరీ చేయిస్తున్నాడన్నారు. ఈ సంక్షేమ పాలన కొనసాగాలంటే ప్రతీ ఒక్కరూ ఫ్యాను గుర్తుకు ఓటేసి వైసిపిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఉషశ్రీచరణ్ దంపతులతో పాటు రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ ఛైర్మన్ పొగాకు రామచంద్ర, మార్కెట్ యార్డ్ ఛైర్మన్ కలిపి శ్రీనివాసులు, జడ్పీటీసి పద్మావతి, ఎంపిపి చంద్రశేఖర్, మండల కన్వీనర్ తిమ్మయ్య, నాయకులు పోతిరెడ్డి, పుప్పం సుధాకర్‌రెడ్డి, కగ్రా సంజీవరెడ్డి, వైశాలి జయశంకర్‌రెడ్డి, ఎన్.నారాయణరెడ్డి, అక్కులప్ప యాదవ్, సి. నారాయణరెడ్డి, బి.నారాయణరెడ్డి, ధనుంజయ, కార్యకర్తలు పాల్గొన్నారు.

మోడీకి ఎపిలో పర్యటించే నైతిక హక్కు లేదు

కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి నరసింహులు

ప్రజాశక్తి-గోరంట్ల రూరల్



ప్రధానమంత్రి నరేంద్రమోడీకి ఆంధ్రప్రదేశ్‌లో పర్యటించే నైతిక హక్కు లేదని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పాలసముద్రం నరసింహులు విమర్శించారు. ఈ నెల 16వ తేదీ ప్రధాని మోడీ పాలసముద్రం పర్యటన నేపథ్యంలో ఆయన ఆదివారం గోరంట్లలో విలేకరుల సమావేశంలో మాట్లాడా రు. నాసిన్ అకాడమీ ప్రారంభోత్సవానికి వచ్చే నైతిక హక్కు మోడీకి లేదన్నారు. ఎపికి ప్రత్యేక హోదా ఇస్తానని తిరుపతి వెంకన్న సాక్షిగా మాట ఇచ్చి తప్పారన్నారు. పాలసముద్రం గ్రామ ప్రజలు 500 ఎకరాలను నాసిన్ సంస్థకు ఇస్తే రైతులకు సరైన నష్టపరిహారం ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నార న్నారు. ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వకుండా రైతులను మోసం చేస్తున్నారన్నారు. ఈ విషయాన్ని నాసిన్ శంకుస్థాపన సమయంలో తాము కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ దృష్టికి తీసుకెళ్తే రైతులను అక్రమంగా అరెస్ట్ చేశారని మండిపడ్డారు. ఆ తర్వాత వచ్చిన కేంద్రమంత్రి దేవాన్ష్ చౌహాన్‌కి, అధికారులకు విన్నవించినా ప్రయోజనం లేదన్నారు. ఇకనైనా భూములు ఇచ్చిన రైతులందరినీ పిలిచి సన్మానించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. దక్షిణ భారతదేశంలో రానున్న ఎన్నికల్లో లబ్ధి పొందడా నికే 30 శాతం పనులు పెండింగ్‌లో ఉన్న నాసిన్‌ను ప్రారంభించి మోడీ ప్రధానమంత్రి స్థాయిని దిగజారుస్తున్నారన్నారు. మోడీ ఎన్ని కుయుక్తులు పన్నినా ఎపి ప్రజలకు నోటా కంటే తక్కువ ఓట్లు ఇచ్చి బిజెపికి గుణపాఠం చెబుతారన్నారు. ఇకనైనా బిజెపి ప్రభుత్వం స్పందించి ఎపికి ప్రత్యేక హోదా ఇవ్వాలన్నారు. అలాగే పాలసముద్రం ప్రజలకు న్యాయం చేయడంతో పాటు మిగిలిన 30 శాతం పను లు పూర్తి చేసిన తర్వాతే నాసిన్ సంస్థను ప్రారంభించాలని కాంగ్రెస్ పార్టీ తరపున డిమాండ్ చేస్తున్నామన్నారు.



లహరికి సన్మానిస్తున్న ఆమె తండ్రి స్నేహితులు

ఎస్ఐగా ఎన్నికైన లహరికి సన్మానం

ముదిగుబ్బ : ఎస్ఐ ఉద్యోగానికి ఎన్నికైన చిగిచెర్ల లహరితో పాటు ఆమె తండ్రి గురుప్రసాద్‌ను ఆదివారం స్థానిక శాంతానంద స్కూల్‌లో స్నేహితులు సన్మానించారు. వారు మాట్లాడుతూ లహరి మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. పాన్‌షాపు నడుపుతూ లహరిని ఉన్నత చదువులు చదివించిన తల్లిదండ్రులను అభినందించారు. కార్యక్రమంలో కంటి వైద్య నిపుణుడు బొగ్గు సురేష్, చంద్రనాయక్, కిషోర్, హుస్సేన్, రజనీకాంత్, ముస్కిన్ పాల్గొన్నారు.

బాబుతోనే భవిష్యత్తుకు గ్యారెంటీ

ఓబుళదేవరచెరువు : మండల పరిధిలోని శేషయ్యగారిపల్లి తండాలో ఆదివారం టిడిపి ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా టిడిపి క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం తెలుగుతమ్ముళ్లు ఇంటింటికీ వెళ్లి సూపర్‌సిక్స్, మినీ మేనిఫెస్టో కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో శేషయ్యగారిపల్లి తండా సర్పంచి రేణుకాబాయి, పొగాకు జాకీర్ అహ్మద్, బడిశం రామాంజనేయులు, కొండే ఈశ్వరయ్య, యనమల గంగాధర్, పొగాకు షానవాజ్, బీలే నాయక్, లక్ష్మీరాంనాయక్, జయచంద్రనాయక్, రమణిబాయి, శ్రీరాములునాయక్, మనోహర్‌నాయక్ పాల్గొన్నారు.



సిఎం జగన్‌ను కలిసిన యువనేత వెంకటరెడ్డి

సిఎం జగన్‌ను కలిసిన యువనేత

చిలమత్తూరు : మండల పరిధిలోని దోర్నాలపల్లి గ్రామానికి చెందిన వైసిపి యువజన సంఘం ప్రధాన కార్యదర్శి వెంకటరెడ్డి ఆదివారం తాడేపల్లిలోని ముఖ్యమంత్రి నివాసంలో సిఎం జగన్‌ను మర్యాద పూర్వకంగా కలిసి భోగి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

కోడిపందెం జూదరుల అరెస్టు

నంబులపూలకుంట : మండల పరిధిలోని పెడబల్లి పంచాయతీలో కోడిపందెం ఆడుతుండగా సిబ్బందితో దాడులు చేసి 11 మందిని అరెస్టు చేసి రూ. 8,100 నగదు, రెండు కోళ్లు, 5 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రమణ తెలిపారు. మండలంలో ఎక్కడైనా అక్రమాలు, అరాచక సంఘటనలు, జూదం, తదితర అసాంఘిక కార్యకలాపాలు జరిగితే సమాచారం ఇవ్వాలని ఎస్ఐ ప్రజలకు సూచించారు.

కోవెలగుట్టపల్లిలో విద్యార్థి అదృశ్యం

పుట్టపర్తి క్రైమ్ : మున్సిపాలిటీ పరిధిలోని కోవెలగుట్టపల్లిలో పదో తరగతి చదివే విద్యార్థి కార్తీక్(15) కనిపించకుండాపోయాడు. ఈ విషయమై ఆదివారం బాలుడి తల్లిదండ్రులు రూరల్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. శనివారం రాత్రి తల్లిదండ్రులు మందలించారని కార్తీక్ ఇంటి నుంచి వెళ్లిపోయాడని, తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ కృష్ణమూర్తి తెలిపారు. విద్యార్థి ఎవరకైనా కనిపిస్తే సమాచారం ఇవ్వాలన్నారు.



కార్తీక్(ఫైల్ ఫోటో)

నీచ రాజకీయాలు తగదు


గోరంట్ల : మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామంలో దేవా నరేంద్ర 2021లో రూ. లక్ష అప్పుగా తీసుకున్నా డని, ఆ సొమ్ము తిరిగి ఇవ్వాలని అడిగినందుకు అధికార పార్టీ నాయకులతో కలిసి నాపై అసత్య ఆరోప ణలు చేస్తూ నీచ రాజకీయాలు చేయడం సరైంది కాదని హిందూపురం పార్లమెంటు టిడిపి కార్యదర్శి దేవా నరసింహప్ప పేర్కొన్నారు. దేవా నరసింహప్ప మాట్లాడుతూ కొత్తపల్లిలో గొల్ల రామాంజనమ్మపై జరిగిన దాడితో నాకు ఎటువంటి సంబంధం లేదని, తనను రాజకీయంగా దెబ్బతీయడానికి తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని స్పష్టం చేశాడు. కేవలం బాకీ డబ్బులు అడిగినందుకే నీచ రాజకీయాలు చేస్తున్నాడని మండిపడ్డారు.

పాత్రికేయులకు హెల్మెట్లు పంపిణీ

తనకల్లు : సంక్రాంతి సందర్భంగా మండలంలో వివిధ దిన పత్రికల్లో పనిచేస్తున్న పాత్రికేయులకు ఆది వారం ప్రముఖ పారిశ్రామికవేత్త ఎంజి రెడ్డి ఆధ్వర్యంలో హెల్మెట్లు, స్వీట్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ వినోద్‌కుమార్, వైసిపి యువ నాయకులు రామ్‌దేశాయ్ మాట్లాడు తూ నేటి సమాజంలో పాత్రికేయుల పాత్ర ఎంతో విలువైందన్నారు. విధి నిర్వహణలో భాగంగా ప్రజా సమస్యలను తెలుసుకొనేందుకు నిరంతరం ద్విచక్ర వాహనంపై ప్రయాణం చేస్తుంటారన్నారు. ఈ తరు ణంలో వారి శ్రేయస్సు కోరి ఎంజి.రెడ్డి సహకారంతో హెల్మెట్లు అందజేయడం హర్షించదగ్గ విషయమ న్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు సమరసింహారెడ్డి, కార్తీక్, సాయి, పాత్రికేయులు పాల్గొన్నారు.

బుక్కపట్నం ప్రెస్‌క్లబ్ కమిటీ ఎన్నిక

బుక్కపట్నం : బుక్కపట్నంలో ఆదివారం నిర్వహించిన వర్కింగ్ జర్నలిస్టుల సమావేశంలో సీనియర్ పాత్రికే యులు వంశీ, గంగిరెడ్డి అధ్యక్షతన ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా గంగిరెడ్డి, బత్యాల పవన్ కుమార్, గౌరవ సలహాదారులుగా వంశీ, షామీర్, శ్రీనివాసులు, ప్రెస్ క్లబ్ అధ్యక్షులుగా మారుతిప్రసాద్, ఉపాధ్యక్షులుగా జీవన్ గణేష్, ప్రధాన కార్యదర్శిగా మాల్య వంతం మారుతి, ట్రెజరర్‌గా ప్రశాంత్‌కుమార్, జాయింట్ సెక్రెటరీగా విజయరంగ, కార్యవర్గ సభ్యులు గా మహేందర్‌రెడ్డి, గొర్ల రవికుమార్, రాజేష్‌కుమార్, నాగరాజు, సాయికుమార్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ పాత్రికేయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.



నూతనంగా ఎన్నికైన ప్రెస్‌క్లబ్ కార్యవర్గ సభ్యులు

కదిరి అభివృద్ధికి కృషి : కందికుంట

ప్రజాశక్తి-తనకల్లు

టిడిపి అధికారంలోకి వస్తే కదిరి నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిపే బాధ్యత తీసుకుంటానని టిడిపి ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్ తెలిపారు. స్థానిక ఎస్సీ కాలనీకి చెందిన 50 కుటుంబాలు ఆదివారం కందికుంట, యువ నేత తోట కిషోర్ ఆధ్వర్యంలో పార్టీలో చేరగా వారికి కందికుంట పసుపు కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. అంతకుముందు ఎస్సీ కాలనీవాసులతో పాటు పార్టీ శ్రేణులు బాణసంచా పేల్చి డప్పులు, పూలతో కందికుంటకు ఘనంగా స్వాగతం పలికారు. కందికుంట మాట్లాడుతూ ఐదేళ్లకు ఓసారి అభ్యర్థిని మార్చి పబ్బం గడుపుకోవాలనే ప్రతిపక్ష పార్టీ ఎత్తుగడను గమనించాలన్నారు. జగన్ పాలనలో రాష్ట్రంలో ఎస్సీలపై జరిగిన అనేక అరాచకాలు ఉదాహరించారు. అనంతరం కిషోర్ ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమంలో పలువురికి కందికుంట వడ్డించి ప్రారంభించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ రెడ్డి శేఖర్ రెడ్డి, నాయకులు శంకర్‌నాయుడు, రాజారెడ్డి, ఆనందరెడ్డి, తోట సరోజమ్మ, మహబూబ్ బాషా, మద్దిగొల్ల ప్రసాద్, మహిళలు పాల్గొన్నారు.



తనకల్లులో సమావేశంలో మాట్లాడుతున్న కందికుంట

వైసీపీ పాలనపై ప్రజల్లో వ్యతిరేకత

కదిరి టౌన్ : రాష్ట్రంలో ప్రస్తుతం వైసీపీ పాలన, ప్రజాప్రతినిధులపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. తలుపుల మేజర్ పంచాయతీ కదిరి రూరల్‌కు చెందిన పలువురు వైసిపి నాయకులు ఆదివారం పట్టణంలోని కందికుంట నివాసంలో టిడిపిలో చేరగా పసుపు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కందికుంట మాట్లాడుతూ జగన్ పాలనలో అధోగతి పాలైన రాష్ట్రాన్ని మళ్లీ గాడిలో పెట్టాలంటే జనసేన, టిడిపి ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు.

తెలుగు సంప్రదాయానికి నిలువుటద్దం సంక్రాంతి

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

భారతీయ, తెలుగు సంప్రదాయాలకు నిలువుటద్దం సంక్రాంతి సంబరాలు అని మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక దుర్గమ్మ గుడి సమీపంలో ఆదివారం టిడిపి, జనసేన పార్టీల ఆధ్వర్యంలో సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు. న్యాయనిర్ణేతగా శ్రీదేవి మిత్రబృందం వ్యవహ రించింది. ముఖ్యఅతిథిగా హాజరైన పల్లె మాట్లాడుతూ పండించిన నవధాన్యాలు ఇంటికి చేరుకోగా ఆ ఆనందం, సంతోషం కలగలిపి చేసుకొనే పండగే సంక్రాంతి అన్నారు. పండుగ రోజు టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి పత్తి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం పోటీల్లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విజేతలు లక్ష్మీ ప్రసన్నకు కుట్టు మిషన్, మాధవికి మిక్సీ, భారతికి గ్యాస్ స్టవ్ అందజేశారు. పోటీల్లో 52 మంది పాల్గొనగా అందరికీ ప్రోత్సాహక బహుమతులుగా చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జనసేన మండల కన్వీనర్ పెద్దన్న, చెన్నకృష్ణమ్మ, బేకరీ నాయుడు, లావణ్య గౌడ్, పవన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు అందజేస్తున్న పల్లె

అధైర్యపడొద్దు అండగా ఉంటా : 'పల్లె'

ప్రజాశక్తి-కొత్తచెరువు రూరల్

అధైర్యపడొద్దు అండగా ఉంటానని మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి టిడిపి శ్రేణులకు భరోసా ఇచ్చారు. పల్లె ఆదివారం మండల పరిధిలోని పలు గ్రామాల్లో పర్యటించి పలువురి కుటుంబాలను పరామర్శించారు. బండ్లపల్లి పంచాయతీ ఎర్రవల్లి గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకుడు శ్రీనివాసులు భార్య రంగమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న పల్లె వారి ఇంటికి వెళ్లి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించి ఆర్థికసాయం అందజేశారు. మరో నాయకుడు మృతి చెందడంతో వారి కుటుంబానికి ఆర్థికసాయం అందజేశారు. అనంతరం భైరాపురం గ్రామంలో హరిజన రామప్ప భార్య గంగరత్నమ్మ అనారోగ్యం బారిన పడడంతో వారి కుటుంబాన్ని పరామర్శించి వైద్య ఖర్చులకు నగదు అందజేశారు. ఈశ్వరప్ప మృతి చెందడంతో ఆయన కుమారుడు నరసింహులు ను పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. పల్లెతో పాటు సర్పంచి రవి, క్రిష్టప్ప, కేశప్ప, సురేష్‌నాయుడు, వెంకటరామప్ప, కొత్తచెరువు టౌన్ కన్వీనర్ ఒలిపి శ్రీనివాసులు, ఓబుల్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, చెన్నారెడ్డి, శంకరప్ప పాల్గొన్నారు.

బిసిలు సంఘటితం కావాలి

ప్రజాశక్తి-కదిరి టౌన్

కులాలుగా కాకుండా వెనుక బడిన వర్గాలకు చెందిన ప్రతి ఒక్కరూ సంఘటితం కావాలని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్, బిసి సంక్షేమ జాతీయ ప్రధాన కార్యదర్శి బత్తల వెంకటరమణ, సిపిఐ వేమయ్య యాదవ్ పిలుపునిచ్చారు. పట్టణంలోని ఎన్జీవో హోంలో ఆదివారం చింతా నాగరాజు అధ్యక్షతన బిసిల సమస్యలపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. వక్తలు మాట్లాడుతూ జనాభా దామాషా పద్ధతి ప్రకారం చట్టసభల్లో బిసిలకు రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. బలహీన వర్గాలకు చెందిన వ్యక్తులు చట్టసభలకు ప్రాతినిధ్యం వహించడానికి పార్టీలకతీతంగా మద్దతు తెలిపి గెలిపించాలని కోరారు. బిసిలు రాజ్యాధికార కోసం అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బిసి సంఘం నాయకుడు బిసి పెద్దన్న, నారాయణ, రామ్మోహన్, భాస్కర్, ఎన్‌ఆర్ శ్రీనివాసులు, భోజనం శ్రీనివాసులు, మునిస్వామి, శ్రీనివాసులు, నబిరసూల్, బిసి గోవిందు, జెవి రమణ, ప్రసాద్, హరి, శీన, గోవర్ధన, రమణ, రామచంద్ర పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కందికుంట వెంకటప్రసాద్